# రాష్ట్ర సాధనలో ప్రాణాలు పణంగా పెట్టాం

- బీఆర్ఎస్ గెలుపు చారిత్రక అవసరం
- బీఆర్ఎస్ సీనియర్‌నేత, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు



కట్కూరులో ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు

అక్కన్నపేట, నవంబర్ 9: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పణంగా పెట్టినోళ్లమని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు అన్నారు. గురువారం మండలంలోని రామవరం, కట్కూరు గ్రామాల్లో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కలిసి ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెప్టెన్ లక్ష్మీకాంతరావు తెలంగాణ ఏర్పాటు అవశ్యకత, ఉద్యమ పోరాటం, ఆనాటి కాంగ్రెస్, బీజేపీ వ్యవహరించిన తీరును క్లుప్తంగా వివరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు చారిత్రక అవసరం అన్నారు. తెలంగాణ వ్యతిరేక శక్తులన్నీ ఒక్కటై ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని చెప్పారు. ప్రతిపక్షాలకు డిపాజిట్లు దక్కకుండా చిత్తుగా ఓడించి, మరోసారి తెలంగాణ బలాన్ని నిరూపించాలన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రానికి అత్యంత కీలకమని, పదేండ్ల క్రితం తెలంగాణ ఎలా ఉన్నది, ఇప్పుడు ఎలా మారిందో ఓటర్లు ఆలోచన చేయాలని సూచించారు. ఎన్నికలప్పుడు వచ్చిపోయే పార్టీలు మస్తుగా ఉంటాయని, అభివృద్ధి, ప్రజల సంక్షేమం గురించి పట్టించుకునే బీఆర్ఎస్‌ను ఆదరించాలన్నారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా అనేక సంక్షేమ పథకాలను చేపట్టి పారదర్శకంగా అమలు చేస్తున్నదని చెప్పారు. కొంత మంది పనిగట్టుకొని బీఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు ఆ ప్రచారాన్ని తిప్పుకొట్టాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, జిల్లెల గాల్‌రెడ్డి, తక్కళ్లపల్లి రాజగోపాల్‌రావు, ఎంపీపీ మాలోత్ లక్ష్మీబీలూనాయక్, జడ్పీటీసీ భూక్యా మంగ తదితరులు పాల్గొన్నారు.

**సతీశ్‌కుమార్‌ను మీ బిడ్డగా ఆశీర్వదించండి**

హుస్నాబాద్ ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు సేవలందించిన బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్‌ను మీ బిడ్డగా మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. నిత్యం నియోజకవర్గ అభివృద్ధి కోసం తపించే మంచి మనస్సున్న వ్యక్తి సతీశ్‌కుమార్ అన్నారు. తొమ్మిదేండ్లలో సుమారు రూ.9 వేల కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చారన్నారు. తమ కుటుంబం ప్రజల పక్షాన, పార్టీకి పని చేస్తుందని తెలిపారు. ఉద్యమంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామని, జైలుకు సైతం వెళ్లామని చెప్పారు. తమకు రామవరం, కట్కూరు గ్రామాలతో విడదీయని అనుబంధం ఉన్నదని, ఎనుకట బంధువుల ఇండ్లకు ఎడ్ల కచ్చరంలో వచ్చేవాళ్లమని గుర్తు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ హుస్నాబాద్‌లో నిర్వహించిన తొలి ఎన్నికల ప్రజా ఆశీర్వద సభకు బహుమనంగా సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలుపించాలని పిలుపునిచ్చారు.

## చేర్యాలలో కాంగ్రెస్‌కు షాక్



కాంగ్రెస్ ఎంపీటీసీలకు గులాబీ కండువా కప్పుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, నవంబర్ 9: జనగామ నియోజకవర్గంలోని చేర్యాల మండలంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. కాంగ్రెస్‌కు చెందిన ముస్త్యాల ఎంపీటీసీ ఖమర్‌సుల్తానాతోపాటు మాజీ ఎంపీటీసీ, సీనియర్ నాయకుడు అతాహర్‌అహ్మద్, మేజర్ గ్రామ పంచాయతీ ఆకునూరు ఎంపీటీసీ(1) సుంకరి శ్రీధర్‌గౌడ్ బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు, రణం ప్రశాంత్ ఉన్నారు.

## సిద్దిపేటలో ఆరో రోజు 20 నామినేషన్లు

సిద్దిపేట, నవంబర్ 9: సిద్దిపేట అసెంబ్లీ స్థానానికి ఆరోరోజు గురువారం 20నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి రమేశ్‌బాబు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 25 మంది అభ్యర్థుల నుంచి 41 నామినేషన్లు వచ్చాయని పేర్కొన్నారు. గురువారం బీఆర్ఎస్ తరపున తన్నీరు హరీశ్‌రావు రెండు సెట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా మామిండ్ల రాములు, గువ్వల సంతోష్‌కుమార్, రజనీకర్‌రెడ్డి చాడా, మోత్కు సాయి, ఏటి ఆంజనేయులు, పెదమాతరి బాబు, బొమ్మల ప్రవీణ్‌కుమార్, బర్రె మల్లయ్య రెండో సెట్, కొలిమి మల్లేశం రెండో సెట్, ధర్మాజీపేట ప్రతాప్ రెడ్డి రెండో సెట్, చేన్నోజు రాజు రెండో సెట్, ఎక్కలదేవి లింగం రెండో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. దూది శ్రీకాంత్ రెడ్డి బీజేపీ తరపున ఒక సెట్ నామినేషన్, హరికృష్ణ పూజల మూడో సెట్, చక్రధర్ గౌడ్ బీఎస్పీ పార్టీ తరపున మూడో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి హరీశ్‌రావు తరపున మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మచ్చ విజితావేణుగోపాల్‌రెడ్డి, రూరల్ మండల ఎంపీపీ శ్రీదేవీచందర్‌రావు, నారాయణరావుపేట సర్పంచ్ మాస శశి యాదగిరి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెహన్‌లాల్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

**హుస్నాబాద్‌లో మరో ఆరు దాఖలు**

హుస్నాబాద్, నవంబర్ 9: హుస్నాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో గురువారం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్వో బెన్ షాలోమ్ తెలిపారు. నామినేషన్ సమర్పించిన వారిలో అయిలేని మల్లికార్జున్‌రెడ్డి(ఇండిపెండెంట్), కామాద్రి మురళి(ఇండిపెండెంట్), పచ్చిమట్ల రవీందర్(ఇండిపెండెంట్), సుంకరి వెంకటస్వామి(పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా), బొత్త నాగభూషణం(ఇండియా ప్రజాబంధు పార్టీ), నగేశ్ మంద(ఇండిపెండెంట్) ఉన్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 18 నామినేషన్లు వచ్చినట్లు తెలిపారు.

## హ్యాట్రిక్ సాధించి రుణం తీర్చుకుంటా

- మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌తో కలసి నామినేషన్ దాఖలు



నామినేషన్ వేస్తున్న రసమయి బాలకిషన్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, తదితరులు

మానకొండూర్, నవంబర్ 9: మానకొండూర్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధించి నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, సిరిసిల్ల జడ్పీవైస్ చైర్మన్ సిద్ధం వేణు, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వేగురుపల్లి మాజీ సర్పంచ్ ముద్దసాని శ్రీధర్‌రెడ్డితో కలిసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారిణి లక్ష్మీకిరణ్‌కు అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ తనపై నమ్మకంతో మూడు సార్లు అవకాశం కల్పించారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు రెండు సార్లు అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా ఆశీర్వదించారని, ఇప్పుడు వారి దీవెనలతో హ్యాట్రిక్ సాధిస్తానని చెప్పారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని ధీమావ్యక్తం చేశారు.

## కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయం

ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో మంత్రి హరీశ్‌రవు

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 9: సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు అన్నారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి గ్రామానికి చెందిన 100 మంది, ఖాజీపూర్ నుంచి 100 మంది, వీరారెడిపల్లి నుంచి 100 మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో కూడవెల్లి జీవనదిగా మారిందన్నారు. ప్రజల కోరిక మేరకు అక్బర్‌పేట భూంపల్లి గ్రామాలతో నూతన మండలాన్ని సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గెలువగానే రెండెడ్లు, నాగలి, నిరుద్యోగులకు జీవనభృతి, రైలు తీసుకువస్తా, ఆడపిల్ల పెండ్లికి మంగళసూత్రం ఇస్తానన్నాడు, కార్పొరేటు దవాఖానా ఏర్పాటు చేస్తానన్న హామీని మూడేండ్లలో రఘునందన్ రావు నెరవేర్చాడా అని ప్రశ్నించారు. ప్రజలు ప్రతిపక్ష పార్టీల మాటలను నమ్మకుండా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంజాల కవితాశ్రీనివాస్, సర్పంచ్ మమతామధు, ఎంపీటీసీ భాగ్యలక్ష్మీచిరంజీవి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, సర్పంచ్‌లు బక్కి భాగ్యలక్ష్మీవెంకటయ్య, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బాలమల్లేశం గౌడ్, నాయకులు బోయ శ్రీనివాస్, పరశురాములు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట, నవంబర్ 9: సిద్దిపేట అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యేందుకు తాము బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గురువారం మంత్రి సమక్షంలో చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భాను తన అనుచరులతో కలిసి గులాబీ కండువా కప్పుకున్నారు. మంత్రి హరీశ్‌రావు వారికి కండువాను కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

## మంత్రికి వాకర్స్ అసోసియేషన్ మద్దతు



తీర్మానప్రతిని మంత్రికి అందజేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

సిద్దిపేట, నవంబర్ 9: సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువుపై అద్భుతమైన వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసి వాకింగ్‌కు మంచి సౌకర్యం కల్పించిన మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతగా ఈ ఎన్నికల్లో పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు వాకర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం మంత్రి హరీశ్‌రావుకు తీర్మానపత్రాన్ని అందజేశారు.

## బుడతడి అభిమానం

**ఎన్నికల ఖర్చు కోసం మంత్రికి కిడ్డీ బ్యాంక్ అందించిన నచికేత**



మంత్రి హరీశ్‌రావుకు కిడ్డీ బ్యాంక్‌ను అందజేస్తున్న నచికేత

సిద్దిపేట, నవంబర్ 9: బీఆర్ఎస్ సిద్దిపేట అభ్యర్థి మంత్రి హరీశ్‌రావుకు ఓ చిన్నారి ఉడతాభక్తిగా ఎన్నికల ఖర్చుకోసం తన కిడ్డీ బ్యాంక్‌ను అందించాడు. సీనియార్ జర్నలిస్ట్ కలకుంట్ల రంగాచారి తనయుడు కలకుంట్ల నచికేత కొంత కాలంగా కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న డబ్బులు రూ.3,295 గురువారం తన తండ్రి రంగాచారితో కలిసి మంత్రి హరీశ్‌రావుకు అందించారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న మంత్రి హరీశ్‌రావుకు ఉడుతాభక్తిగా అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నచికేతను మంత్రి హరీశ్‌రావు అభినందించారు.

## పీకేలు, ఏకేలు ఏమీ చేయలేరు




మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు

తొగుట, నవంబర్ 9: తెలంగాణ వస్తే అన్నం తినబుద్ది కాలేదు అన్న వారితో బీజేపీ పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. తొగుట మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేట గ్రామాలకు చెందిన 50 మంది బీజేపీ నాయకులు గురువారం మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నిలువాలని కోరారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్కటవుతున్నాయని, ఎవ్వరెన్ని కుట్రలు చేసినా సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, సాయి, మధు, యాదగిరి, కరుణాకర్, అజయ్ పాల్గొన్నారు.